# 'మామూలు మనిషిని నేను'

ఆకాశం నల్లముసుగు వేసుకుంది. వర్షం కుండపోతగా కురుస్తోంది.. ధరిత్రి రోదిస్తోందా!! అన్నట్టు చలిగాలులు శూలాల్లా ఎగిరిపడుతూంటే, చెట్లూ చేమలూ విరిగిపడుతున్నాయ్ - ఆకాశం ముక్కలవుతూన్నట్లు! ఉరుములూ, మెరుపులూ, ప్రకృతి విలయతాండవం చేస్తున్నట్లు వికృతంగా ఉంది. తడిక అడ్డంగా ఉన్నా, వాన నీళ్ల సరాసరి గుడిసెలో కొచ్చేసి ఒండుకున్న వంటనీ, పడుకున్న బట్టల్నీ నీటిమయం చేస్తున్నాయి. ప్రమిదలోని ఆముదపు దీపం ఆరిపోకుండా జాగ్రత్తచేస్తూ నర్సింలు రాకకోసం ఎదురుచూస్తూ, బిక్కుబిక్కుమంటూ, పక్కగా ఒదిగి కూర్చుంది రాములమ్మ. కాస్సేపటికి, ప్రకృతి శాంతించింది. మిణుకు మిణుకు మంటూ అక్కడక్కడా వెలిచిన నక్షత్రాలు కాస్త వెలుగునిచ్చాయి.

మెల్లగా తలుపు చప్పుడయ్యింది. గబుక్కున వెళ్లి తలుపు తీసింది రాములమ్మ. ఒక్క అంగలో లోపలికొచ్చి, తలుపు గడియవేసిన అతన్ని చూసి బిత్తరపోయింది. వెంటనే భయంతో గజగజ వణికిపోయింది.

"చలేత్తున్నాదా, అట్టా ఒణికిపోతున్నావ్? దా... నా గుండెల్లో యేడితో నీ సలి పాగొడతాను" నవ్వుతూ తూలుతూ మీదిమీదికి వస్తున్నాడు జోగులు.

రాములమ్మకి గొంతు తడారిపోతోంది. భయం ఉండలా చుట్టుకుపోయి, గొంతు కడ్డం పడ్డట్టయి మాట రావడం లేదు. పిరికితనం బలాన్ని లాగి పారేసిందేమో, దీనంగా కన్నీళ్లు చెంపలమీదుగా జారుతున్నాయ్.

"రాయే నా రవ్వలడ్డూ.. ఇయ్యాల ఈ ఎదవ్వాన ఒదుల్తాదనుకోలేదు. నా అదృష్టం బాగుంది... వానా ఎలిసింది. నర్సింలూ రానేదు" ఒక్క దూకులో వచ్చి రాములమ్మని చుట్టేశాడు.

ఇనపకడ్డీల్లాంటి చేతుల్లో చేపపిల్లలా గిజగిజ తన్నుకుంది రాములమ్మ. కాళ్లతో తన్నింది, వేళ్ళతో పొడిచింది. గోళ్లతో రక్కింది... లాభం లేకపోయింది. అతని బలం ముందు ఆమె ఓడిపోయింది. అన్నీ భరించి తన తృష్ణ తీర్చుకున్నాడు జోగులు. అచేతనంగా పడుంది రాములమ్మ. వెళ్ళిపోవడానికి గడియ తీశాడు జోగులు.

ఎదురుగా నర్సింలు - నర్సింహావతారంలో ఉగ్రమూర్తిలా నుంచున్నాడు. పది నిమిషాల క్రితం సింహబలుడిలా స్వైరవిహారం చేసిన జోగులు, పులిలా రాములమ్మని

కబళించన జోగులు, ఇప్పుడు పాపభారంతో నర్సింలు ఎదుట పిల్లిలా అయిపోయాడు. పారిపోవడానికి కాళ్ళాడటంలేదు. జుట్టుపట్టుకుని జోగులు తలని గోడకేసి కొట్టాడు నర్సింలు. తల బద్దలయిందేమో, రక్తం కాలువలు కట్టింది. ఆ చెంపా, ఈ చెంపా ఛెళ్ళుమనిపించాడు. వాడు పెట్టిన గావుకేకలకి వాడంతా లేచొచ్చింది. జరిగింది తెలుసుకుని, జోగులుకి తగిన శాస్తయిందని సంతోషించారు. నర్సింలు కొడుతూనే ఉన్నాడు. ఈ వినోదం చూసి ఆనందిస్తున్న జనంలోంచి ఒక పెద్దమనిషి ముందుకొచ్చి, నర్సింలు చెయ్యిపట్టుకుని ఆపడంతో ఘట్టం పూర్తయింది.

'వాడు చస్తే నువ్వు జైలుకెళ్ళవలసి వస్తుంది. అప్పుడు నీ భార్యకి తిప్పలు మరీ ఎక్కువయితయి. వీణ్ణి పోలీసులకి ఇచ్చేస్తా. నువ్వు రాములమ్మని చూసుకో'అంటూ ఆ పెద్దమనిషి జోగుల్ని పోలీసులకు అప్పగించాడు. నర్సింలు కన్నీళ్ళతో స్పృహలేక పడున్న భార్యశరీరాన్ని కడగసాగాడు.

చీకట్లను చెండాడుతూ దినకరుడు పరుగుపరుగున వస్తున్నాడు. రాములమ్మ మెల్లగా కళ్ళుతెరిచింది. ఏడుస్తూన్న నర్సింలుకేసి జాలిగా చూసింది.

"ఏడుత్తున్నావా, మావా? ఇంకా ఈ పాపిట్టిదాన్ని ఏలుకుంటావా?" అడిగింది.

'రాములూ! ఏందా మాటలు? ఎందుకేలుకోను? నీతప్పు ఏమున్నాదిందులో? దొంగసచ్చినోడు సేసిన నేరానికి నీకు సిచ్చవేత్తే ఏం న్యాయం?' రాములమ్మ కళ్ళుతుడుస్తూ అన్నాడు నర్సింలు.

"అయినా లోకం నన్ను సెడిపోయినదాన్ననే అంటుంది. నావల్ల నీకు సెడ్డ పేరొత్తుంది, ఇంతకన్నా నాను సచ్చినా బాగుండేది!" వెక్కి వెక్కి ఏడుస్తోంది రాములమ్మ. ఆమెనెట్లా ఓదార్చాలో తెలీక గుండెలకదుముకుని పట్టుకున్నాడు నర్సింలు. ఆక్షణంలో అతనికి లోకంమీద తెగ కోపం వచ్చేసింది బలవంతుడి ముందు బలహీనుడు ఓడిపోవడం నేరమవుతుందా? ఒంటరిగా నిస్సహాయురాలై ఉన్న ఆడది పురుషుడి కామాగ్నికి బలైపోవడం ఆమె నేరమవుతుందా? దహించే శక్తిగల బడబాగ్ని వేగంతో ముందుకొస్తూంటే మాడి మసైపోయిన సమిధలది నేరమవుతుందా? ఇదేం న్యాయం? ఇదేం సంస్కృతి?' ఆలోచనలతో నర్సింలు బుర్ర వేడెక్కిపోతోంది.

రాములమ్మ మనస్సు ఎటో పోతోంది. సరిగ్గా ఆరునెలల క్రితం, తను పనిచేసే వారింటి కోడలు శిరీష సంగతి గుర్తుకొస్తోంది. కళ్ళు బైర్లుకమ్మాయి. ముసురుతూన్న

ఆలోచనలు ఆపలేక అలిసిపోయి కళ్లుమూసుకుంది రాములమ్మ. జరిగినది కళ్లముందు సినిమా రీళ్ళలా కనబడసాగింది.

* * *

ఆరోజు సాయంత్రం ఆరుగంటలకి కళాభవన్‌లో శిరీష వేసిన పెయింటింగుల ప్రదర్శన జరగబోతోంది, విద్యాశాఖామంత్రి ప్రదర్శనకి ప్రారంభోత్సవం చేస్తారు. ఇంటిల్లిపాదీ తయారయ్యారు కార్యక్రమానికి.

"రాములూ! నువ్వూ రావే చూద్దువుగాని నా బొమ్మలన్నీ పెడతారక్కడ" అంది శిరీషమ్మ.

"నానా! నాకేంతెలుస్తదమ్మా, మడుసుల మొకాలైతే గుర్తుబడతకానీ సెట్లూ, సేమలూ, పూలు, కొండలూ, ఇయ్యి నాకు మంచిగనిపించవు. ఆటిని సూడాలంటే అచ్చంగా ఆటికాడికే బోయి నీళ్ళలో ఆడుకోని, పూలు గిట్ట కోసుకోని, సెట్లకిందనే కూసోవచ్చు" అంది నవ్వుతూ.

శిరీషమ్మ పకా పకా నవ్వింది. ఆ నవ్వులోని నాదం పాటలా అనిపించింది తనకి. నవ్వుతూన్నప్పుడు సొట్టలుపడే ఆమె బుగ్గలూ, చక్రాల్లా గుండ్రంగా తిరిగే ఆమె కళ్ళూ - ఆమె అందం వందరెట్లు పెరిగినట్లనిపించింది.

అలాగే రెప్ప వాల్చకుండా ఆమె అందాన్ని చూస్తూ ఉండిపోయిన తననిచూసి - "పోనీ నీ బొమ్మ గీసియ్యమంటావా?" అంది ఆమె.

"ఛీ, పోండమ్మ! అంది తను సిగ్గుపడుతూ.

"రేపు వేస్తాలే. నర్సింలుకి చూపించి 'ఫ్రేం' చేయించమను" అంది. తలలో మల్లెచెండు తురుముకుంటూ, తను సిగ్గుతో కుంచించుకుపోయింది.

రఘుబాబు నల్లసూటూ, బూటూ వేసుకున్నాడు. చిలకపచ్చ చీరకి ముదురు గులాబీరంగు పెద్దంచు పట్టుచీరలో, అదేరంగు జాకెట్టుతో, రఘుబాబుగారి పక్కన నడుస్తూంటే చిలకా గోరింకలని చూసినట్లే అనిపించింది తనకి. దట్టమైన నల్లటి జడ పిరుదులమీదుగా, ఇటూ, అటూ వూగుతూ ఉంటే, హంసలా నడిచి వెడుతూన్న ఆమెకేసి కన్నార్పకుండా చూసింది తను. "కళ్లు చెదిరే అందం'అనుకుని మురిసిపోయింది. ఆ

రాత్రంతా శిరీషమ్మగారి మంచితనాన్ని, ఆమె అందాన్నీ తలుచుకుంటూ గడిపింది తను. పైగా మర్నాడు తన బొమ్మ గీసిస్తాననదిగా! 'ఆ మాట ఇప్పుడే మావతో సెప్పకూడదు. ఏకంగా బొమ్మ తీసుకొచ్చి చూపించాలి. అప్పుడు ఆ బొమ్మ సూసి మావ ఎట్టా ఇదైపోతాడో సూడాలి.'' అనుకుంటూ పలవరింతలాంటి ఆలోచనతో, కలత నిద్దురపోయింది తను.

తెల్లారి లేచి మావకి టిఫిన్ కట్టిచ్చి, తను పనికెళ్ళింది. ఇంటినిండా జనం! పోలీసులు! ఏం జరిగిందో తేలీక ఆశ్చర్యపోయింది తను. రఘుబాబుగారు పాలిపోయి ఉన్నారు. జరం వచ్చిన మనిషిలా పెద్దమ్మగారు ఏడుస్తున్నారు. పెద్దయ్యగారు బాగానే తిరుగుతున్నారు. 'మరి ఏం జరిగుంటుందబ్బా! శిరీషమ్మ గారి నడిగితే అసలు విషయం తెలుస్తుంది.' అనుకుని "శిరీషమ్మగారేరీ?'' అని అడిగింది తను, అక్కడే నుంచున్న అనందుబాబుని.

"ఒదిన కనబడటంలేదు'' అన్నాడు అతను ముక్తసరిగా.

తనేం విందో తనకే అర్థం కాలేదు. 'కనబడకపోవడం ఏంటి? అంటే?'అయోమయంగా అడిగింది. మళ్ళీ తనే. "కనబడక పోవడంల ఏంటి బాబూ! అసలేం జరిగినాదీ?'' అని.

"రాత్రి ఫంక్షనయ్యాక, అందరం చాలాసేపు టాక్సీకోసం నుంచున్నాం ఎంతకీ టాక్సీ దొరకకపోవడంవల్ల బస్సుకోసం బస్‌స్టాండ్‌కి నడవడం మొదలెట్టాం. అందరం ఫంక్షనుగురించే మాట్లాడుకుంటూ నుంచున్నాం. బస్సు వచ్చింది, ఎక్కేశాం. బస్సు కొంత దూరం వచ్చేవరకు ఎవరం గమనించలేదు, వదిన బస్సు ఎక్కలేదని! బస్సంతా బాగ కలియజూసాక, బస్సు నాపి అందరం అక్కడ దిగిపోయి, ఆటోలో 'కళాభవన్'కి వెళ్లాం. అక్కడా కనిపంచలేదు. ఆటోలో ఒచ్చేసిందేమోనని ఇంటికొచ్చి చూశాం. ఎక్కడా ఆమె కనిపించకపోయేసరికి పోలీసు రిపోర్టు ఇచ్చాం. ఇంతవరకూ ఇంకా ఏ సంగతీ తెలీదు'' ఆనంద్‌బాబు కళ్ళలో నీళ్ళు నిండాయి. మరి మాట్లాడలేకపోయాడు.

శిరీషమ్మ కనబడకపోవడమేమిటి? చిన్నపిల్లా ఏమన్నానా, దారి తప్పిపోయిందేమోనను కోవడానికి? తన చెవులను తనే నమ్మలేక పోతోంది. దుఃఖం ముంచుకొచ్చింది. కళ్ళొత్తుకుంటూ, అక్కడే నుంచుండిపోయింది తను. కాస్సేపటికి పోలీసు వ్యాను దూసుకొచ్చింది. బిలబిలమంటూ, పదిమంది పోలీసు వాళ్లు దిగారు అందులోంచి. అందరూ ఆత్రంగా

అటుకేసి వెళ్లారు. మోకాళ్లకి తల ఆనించి, సీటుమీద ఏడుస్తూ కూర్చుంది శిరీష. చెదిరిన జుట్టు, చిరిగిన చీరా, పాలిపోయిన మొహం, ఆమెను చూడగానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి తనకి. "రా, శిరీషా!" అంటూ చెయ్యపట్టుకు దింపాడు రఘుబాబుగారు. నడవలేక తూలిపోతోంది ఆమె. తను వెళ్ళి మెల్లిగా నడిపించుకొచ్చి మంచం మీద పడుకోబెట్టింది. స్పృహలేని దానిలా మంచం మీద వాలిపోయింది. ఆమె. పోలీసులు చెప్పిన కథనం రెండునిమిషాల్లో అంతా పాకిపోయింది. బస్సుకోసం అందరూ నిలుచున్నప్పుడు, ఎవరి మాటల్లో వారున్నారట. తను బస్సు ఎక్కేవారిలో ఆఖరుది. బస్సుకేసి నడుస్తూంటే ఎవరో వెనుకనుంచి నోరుమూయించి బలంగా వెనక్కు లాగేశారు ఎక్కన్వికుండా. బస్సు కదిలిపోయింది. తను వాళ్ళచేతుల్లో చిక్కుకుపోయింది. వాళ్ళు తనని తీసుకెళ్ళి, టాక్సీలో పడేసి టాంకుబండు మెట్లకింద పడేసి, ఒక్కొక్కరే బలాత్కరించారు. ఎంత పోరాడినా ఆ నలుగురి చేతుల్లో తను నలిగిపోయింది. తరుబాత వాళ్లు ఎటు వెళ్ళిపోయారో తనకి తెలీదు' ' ఇదీ ఆమె పోలీసుల కిచ్చిన స్టేట్‌మెంటు.

ఆ తరువాత, పోలీసు రిపోర్టురాగనే, పోలీసులు నలుమూలలా గాలిస్తూ, స్పృహలేకుండా పడున్న ఈమెను ఆస్పత్రిలో చేర్చారు. 'తెలవారుజామున స్పృహ వచ్చింది. మీ కోసం అడుగుతూ, వెక్కి వెక్కి ఏడుస్తోంది. అక్కడ వుండనని గోలపెడుతూవుంటే, ఆమెను ఆస్పత్రినుంచి ఇక్కడికి తీసుకొచ్చాం' అని చెప్పాడు పోలీసు ఇన్‌స్పెక్టర్. వాళ్ల బాధ్యత తీరిపోయినట్లు ఇంక, అక్కడి నుండి వెళ్ళిపోయారు. పోలీసులు. అంతవరకూ మనిషి ఏమైపోయిందో తెలీక, ప్రాణంతో ఉందో లేదో తెలీక, ఏడుస్తున్న ఇంటిల్లిపాదీ, ఇదంగా విన్నాక అదోలా అయిపోయారు. అంతవరకూ అక్కడ గుమిగూడిన ఆడా, మగా అంతా ఒక్కొక్కరే మెల్లగా జారుకున్నారు.

భర్తకోసం తహతహలాడిపోతున్న శిరీష అతను లోపలకి రాగానే అతని కాళ్ళమీదపడి గుండె బద్దలయ్యేలా ఏడ్చింది. ఆమెనెలా వూరడించాలో తెలీనివాడిలా, చలనంలేని మనిషిలా అయిపోయాడు రఘుబాబు.

"అమ్మా! వదినకు కాఫీ ఇవ్వమ్మా" అన్నాడు అనందబాబు.

"ఇస్తాన్లే. ముందు వాళ్ళ వాళ్ళకి ఉత్తరం రాయమని చెప్పు అక్కయ్యతోటి. వెంటనే వచ్చి ఈవిడని తీసికెళ్లిపొమ్మని" అంది ఆండాళమ్మ.

“అదేమిటమ్మా? వదినని పంపించేద్దామా? అంటే ఈ ఇంట్లో ఉండడానికి ఆమె పనికిరాదా”? ఆశ్చర్యంగా అడిగాడు ఆనందబాబు.

‘ఆవిడ ఈ ఇంట్లో ఉంటే ఇంత జరిగాక, ఇక నీ చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు కావు. బయట కుక్కలు ముట్టిన విస్తరిని. ఇంట్లోకి తెచ్చిపెట్టుకుంటామా? అంగడి బొమ్మ ఇంటిమనిషెలా అవుతుంది?” రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది ఆవిడ.

చిన్నవాడైనా ఆలోచనాపరుడు, ఆధునిక భావాలు గల ఆనందబాబు, ఆవిడతో ఏకీభవించలేకపోయాడు.

“అన్నయ్యా! నీఉద్దేశ్యం?” అన్నాడు.

“అమ్మ మాటలో నిజం లేకపోలేదు” అన్నాడు తలవంచుకుని.

“ఇప్పుడెందుకు ఈ ప్రస్తావన? ముందు ఆవిడకి కాఫీ పొయ్యండి వాళ్ళవాళ్ళు వచ్చాక మాట్లాడుకోవచ్చు. రఘుబాబూ! వాళ్ళ నాన్నగారిని రమ్మనమని టెలిగ్రాం పంపించు’ ’ అన్నారు సుందరరావుగారు యజమానిగా తన తీర్పు ఇస్తూ. వీళ్ళ మాటలు వింటున్న శిరీష తల తిరిగిపోయింది.

“ఇదేనా వీళ్ళ సంస్కారం? ఇదేనా ఆడదానికి సంఘం కల్పించే రక్షణ? జరిగిన దానిలో తన తప్పేముంది? తనేమైనా వ్యభిచరించిందా? లేచిపోయిందా? తన శీలం కాపాడుకోవడంకోసం నలుగురు బలవంతులతో ఎంత యుద్ధం చేసింది తను! ఇదే ఘోరం ఆండాళ్లమ్మగారికే జరిగితే? లేకపోతే ఆమె బిడ్డలకి జరిగితే? పాడయిపోయిన వస్తువుని బాగాలేదని తిరిగి వాపస్ చేసినట్లు, పుట్టింటికి పంపించేస్తారుట! ఆడదంటే ఎంతచులకన? ఛీ!ఛీ! ఆడదాని బతుకు గాజుబొమ్మలాంటిది. ఏ చిన్న రాయి తగిలినా చాలు, పగిలిపోతుంది. పగిలిన బొమ్మ పనికిరాదంటూ అవతల పారేస్తారు. కన్నతండ్రి నుంచి, కట్టుకున్న మొగుడి వరకూ ఇదొక పరాభవంగా, అవమానంగా భావిస్తారేగాని, ‘అబల ఆ స్థితిలో ఏం చెయ్యగలుగుతుంది’ అని అనుకోరు. తోటి ఆడవాళ్లు? ఏదో కుళ్ళిపోయిన వస్తువును చూసి అసహ్యించుకున్నట్లు అసహ్యించుకుంటారు. అంతేకాని, తామే ఆ పరిస్థితిలో ఉంటే? - అని ఒక్క నిమిషం కూడా ప్రశ్నించుకోరు. ఈ సంకుచిత భావాలతో కుళ్ళుతూన్నది సమాజం. పరువు పేరిట న్యాయాన్ని ఉరికంబం ఎక్కించే ఈ సంఘం, సాంప్రదాయాల పేరిట నీతినే సజీవంగా దహనంచేసే ఈ సంఘం నాకొద్దు - కొన్ని గంటల క్రితం నన్నూ, నా కీర్తినీ, తెగ మెచ్చుకున్న వీళ్ళు ఇప్పుడు నేనేం చేశానని

నన్ను తిరస్కరిస్తున్నారు? నాకు జరిగిన అన్యాయానికన్నా వారికి జరగబోయే అవమానాన్ని ఊహించుకొని నన్ను అసహ్యించుకొనే వీళ్ళ మధ్య ఒక్క నిముషం ఉండకూడదు! తనూ ఒక మనిషేనని, తనకీ మనసుందని, అది విరిగిన చోట తను ఒక్కక్షణం కూడా వుండలేననీ, ఈ విశాల ప్రపంచంలో, తన హస్తకళా నైపుణ్యంతో ఎక్కడైనా బ్రతకగలనని నిరూపించాలని అనుకుంది. కానీ, సాంప్రదాయంకోసం చచ్చిపోయే కుటుంబాలు, అలా పోతే మరీ కుళ్ళి కుళ్ళి ఏడుస్తారనే ఆలోచనతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటూ, వారి ప్రవర్తన చూసి, వారు చూపే విముఖత భరించలేక, పళ్లు కోసేకత్తితో ప్రాణాలు తీసుకుంది శిరీష, తన భావాలనన్నింటినీ కాగితంలో రాసిపెట్టి.

మళ్ళీ జనం పోగయ్యారు. "పాపం, తనకి జరిగిన మానభంగాన్ని భరించలేక, ఆత్మహత్య చేసుకుంది" అంటూ ఆండాళ్ళమ్మగారితో సహా అందరూ అనడం చెవులారా విని, కన్నీరు పెట్టుకోవడం కొనవూపిరితో కళ్ళారా చూసి నవ్వుతూ కన్నుమూసింది శిరీష.

* * *

"శిరీషమ్మా" అంటూ అరిచింది రాములమ్మ జరిగినదంతా బుర్రలో మెదులుతూంటే.

"హు . . . పిచ్చిదానా!.. ఆ యమ్మని తలుచుకొని బాధపడుతున్నావా? ఆళ్ళు పెద్దోళ్ళు. పరువూ, మరియాదా అంటూ పానాలు తీస్తారు. ఆళ్లకి నాయం, సత్యం ఇయ్యి రుసించవు. నిన్నట్లా ఒదులుకోటానికి రఘుబాబుగోరిలా సదువుకున్నోణ్ణి గాను నేను. మామూలు మనిషిని. సాటి మనిసిగా నీ కట్టాన్ని అరదంచేసుకునే మనిసిని. నాకన్న బలవంతుడొచ్చి నన్ను నాలుగు తన్ని మక్కెలిరగగొడితే, ఆడి ముందు వోడిపోవడం నా తప్పవుద్దా? నా దురదుష్టం అయితది కాని! అది కాదని వోడన్నా అంటే నాయశాస్త్రమే తిరిగి రాయించాల, నాయాల్డి" పళ్లు పటపటా కొరుకుతూ ఆవేశంలో చెప్పుకుపోతూన్న నర్సింలు కేసి కృతజ్ఞతతో చూసింది రాములమ్మ.

"మా . . .వా . . .! సిన్న పుట్టక పుట్టినా, నీ బుద్ధి మాత్రం మా పెద్దది. పెద్దింటిలో పుట్టిన రఘుబాబుగారికి ఈ మాత్రం బుద్దుంటే శిరీషమ్మ లచ్చనంగా బతికుండేది. నా బొమ్మ గీసేది. ఇంకెన్ని బొమ్మలు తీసేదో! కానీ తానే గాజుబొమ్మలా బద్దలయిపోయింది. అసలు

రఘుబాబుగోరు ఏలుకోకపోతే మాత్రం ఏంటంట? అమ్మగోరు సదువుకుంది. సేతినిండా బొమ్మలు గీసుకుని సంపాదించుకునే సక్తుంది. ఆమె సావకుండా రఘుబాబుగోరికి బుద్ధి సెప్పుండాల్సింది మాం.వా! అప్పుడు ఆడోల్లందరూ ఆ రఘుబాబుగోరి ముకాన ఉమ్మేస్తుండేవారు" అంది.

నర్సింలు ఒడిలోకి ఒదిగిపోతూ! మాంవా! ఈ కతని ఇంతటితో మనం ముగించొద్దు మాం.వా? ఆడది మాత్రమే శీలాన్ని కాపాడుకోవాలా? సెడిపోవటానికిదేమన్నా పండా కాయా? ఆమెకి బతికే హక్కులేదా? పదిమంది ఆడోల్లు ఆయన మీదపడి రక్కి భంగపరిస్తే ఏం సేసేవాడంటా? ఆడదానికో నీతీ, మగాడికో నీతీనా? అదెట్టా?

ఇప్పుడు రాములమ్మగారు మహిళా సంఘం నాయకురాలు. స్త్రీ విమోచనా సంఘ అధ్యక్షురాలు.

* * *